


## ఆర్‌టిసి డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆర్‌టిసిలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిపిటిఒ సిహెచ్ అప్పలనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి గ్యారేజ్ వద్ద హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న 16వ బ్యాచ్ కు ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ సర్టిఫికెట్లు అందజేశారు. భవిష్యత్తులో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న 17వ బ్యాచ్‌లో చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక ఏడాది అనుభవం కలిగి 21ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ శిక్షణకు అర్హులని, 40రోజులు పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9866649336, 7382924030., 9959225620 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ అండ్ డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు డ్రైవింగ్ స్కూల్ ఇనస్ట్రక్టర్ డిఎన్ రాజు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు అందని భరోసా

- వేట నిషేధ కాలానికి దక్కని సాయం
- ఎన్నికల అధికారుల అనుమతితో అమలు చేయాలంటున్న గంగపుత్రులు
- 3798 మంది లబ్ధిదారులు గుర్తింపు
- వేట లేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు



వలలు కుట్టుకుంటున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-భోగాపురం

చేపలవేట నిషేధించి రోజులు గడస్తున్నప్పటికీ ప్రభుత్వం మత్స్యకార భరోసాను అమలు చేయకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల కోడ్ పేరుతో వాయిదా వేసినప్పటికి చేయూత, విద్యాదీవెన వంటి ఇతర పథకాలకు డబ్బులను లబ్దిదారుల ఖాతాల్లోకి ఎలా వేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. వేట తప్ప ఇతర ఎటువంటి పనులు చేయలేని తమను ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు అంటున్నారు. చేపలు గుడ్లు పెట్టే సీజన్ కావడంతో ప్రతిఏటా ఏప్రిల్ 15 నుంచి 60రోజులు పాటు సముద్రంలో వేటను ప్రభుత్వం నిషేధిస్తుంది. ఈనేపథ్యంలో గతనెల 15వ తేదీ నుంచి వేటకు వెళ్లరాదని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మత్స్యకారులకు భృతి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికి వారి ఖాతాల్లో మత్స్యకార భరోసా పేరుతో 10వేలు రూపాయలను అందజేసేది. ఈసారి ఎన్నికల కోడ్ ఉండడంతో ప్రభుత్వం కూడా దీనిపై పెద్దగా దృష్టి సారించలేదు. దీంతో కుటుంబాలతో ఎలా జీవనం సాగించాలో తెలియడం లేదని అంటున్నారు.

**మత్స్యకార భరోసా కోసం 3798 మంది గుర్తింపు**

జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో సుమారు 11మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 10వేల కుటుంబాలు చేపలు వేటే ఆధారంగా బతుకుతున్నాయి. ఈ రెండు మండలాల్లో సుమారు 1121 బోట్లు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం ఆదేశాల మేరకు తీరప్రాంత గ్రామాల్లో మత్స్యకార భరోసా కోసం 3798 మందిని మత్స్యశాఖ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇందులో వీరికి ఎవరికైనా కార్లు లేదా కరెంటు బిల్లులు ఎక్కువగా వచ్చిన వారిని విచారణ చేసి తొలగించనున్నారు.

**ఓట్ల లెక్కింపు తర్వాతే లబ్దిదారుల ఖాతాల్లోకి మత్స్యకార భరోసా**

ఎన్నికల కోడ్ ఉండడంతో ఈ పథకాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు. ప్రస్తుతం కేవలం లబ్దిదారులను మాత్రమే గుర్తించారు. కాని వారి ఖాతాల్లోకి నగదు జమ చేసేందుకు ఇంకా చాలా సమయం పడే అవకాశం ఉందని అంటున్నారు. ఎందుకంటే మత్స్యశాఖ అధికారులు పంపించిన జాబితాను పరిశీలించిన తరువాత అర్హులైన వారిని గుర్తించాల్సి ఉంది. ఇంకా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. ఇలా చూసుకుంటే ఓట్ల లెక్కింపు తర్వాతే లబ్దిదారుల ఖాతాల్లోకి నగదు జమకానుందని తెలుస్తోంది. అంత వరకు మమ్మల్ని ఆదుకునేది ఎవరని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు పూర్తయినందున ఎన్నికల అధికారుల అనుమతి తీసుకొని తమకు నగదు జమచేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.



వేట నిషేధంతో ఒడ్డున ఉన్న పడవలు

**వేటకు వెళ్లే మత్స్యకారులను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపించాం**



మత్స్యకార భరోసా కోసం జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో వేటకు వెళ్లే మత్స్యకారులను నేరుగా గ్రామాలకు వెళ్లి 3798 మందిని గుర్తించాం. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపించారు. ఈ పథకం ద్వారా లబ్దిదారుల ఖాతాల్లోకి ఎప్పుడు నగదు జమవుతుందనే దానిపై ఇంకా ఎటువంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదు.

**ఎన్. నిర్మలా కుమారి,**
**మత్స్యశాఖ డిడి**

# నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

**బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం మొండి వైఖరి**

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్ సేవలకు బిల్లులు చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి వైద్య సేవలను నిలుపుదల చేయనున్నాయి. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ఇప్పటికే ప్రకటించింది. ఆరోగ్యశ్రీ నెట్ వర్కు ఉన్న ఆస్పత్రులన్నీ సేవలను నిలుపుదల చేయనున్నట్లు ఆ యూనియన్ తెలిపింది. ఈమేరకు విజయనగరం ఉమ్మడి జిల్లాలో కూడా ఈ సేవలను నిలుపుదల చేయనున్నారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఇప్పటికే పలుమార్లు ఆస్పత్రుల యాజమాన్యాలు తమ సేవలను నిలుపుదల చేయడం, ప్రభుత్వం బిల్లులు చెల్లించిన తరువాత తిరిగి పునరుద్ధరించడం జరుగుతోంది. తాజాగా ఆరు నెలలుగా ఆస్పత్రులకు బిల్లులు చెల్లించక పోవడంతో ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ తమ సేవలను నిలుపుదల చేయనున్నట్లు ప్రకటించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ 600కు పైబడి ఉన్నాయి. విజయనగరం ఉమ్మడి జిల్లాలో 16 ఆస్పత్రులు ఉన్నాయి. వీటన్నింటికీ 2023 సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.1500కోట్ల రూపాయలు, విజయనగరం జిల్లాకు సుమారు రూ.70కోట్లు వరకు బకాయిలు ఉన్నాయి. దీంతో యాజమాన్యాలు డబ్బులు రాకపోతే హాస్పిటల్స్‌ను ఎలా నడపాలని, రోగులకు ఎలా సేవాలందించాలని ప్రశ్నిస్తూ సంబంధిత మంత్రిత్వ శాఖకు లేఖ రాశాయి. అయినా స్పందన లేకపోవడంతో సేవలను నిలుపుదల చేయాలని నిర్ణయించాయి. బిల్లులు చెల్లించకపోతే, ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటని యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో పాటు ప్రైవేటు నెట్‌వర్కు ఆస్పత్రులు, ప్రైవేటు మెడికల్ కాలేజీలు కూడా సేవలను బంద్ చేయనున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే అత్యవసర రోగులు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు.




# జిందాల్ చర్చలు విఫలం

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కార్మిక సమస్యలపై విజయనగరం డిసిఎల్ వద్ద మంగళవారం యాజమాన్యంతో కార్మిక సంఘాల నాయకులు చేసిన చర్చలు విఫలమయ్యాయి. ఈ చర్చలకు కంపెనీ నుంచి డిజిఎం హెచ్ఆర్ గోపాలకృష్ణ, మేనేజర్ సన్యాసినాయుడు పాల్గొనగా, కాంట్రాక్టు వర్కర్స్ నుంచి పి. వెంకటేష్, బి. రామచంద్రరావు, కార్మికుల నుంచి జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు నెక్కల నాయుడు బాబు, కె.సురేష్, పిల్ల అప్పలరాజు, ఇతర కార్మికులు పాల్గొన్నారు. చర్చలు విఫలం కావడంతో కార్మికులు వెనుదిరిగారు. గత ఐదు రోజుల నుంచి ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్నప్పటికీ యాజమాన్యం కనీసం స్పందించకుండా వ్యవహరించిన తీరుపై కార్మికులు మండిపడుతున్నారు. వంటావార్పు చేసినప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదని ఆగ్రహిస్తున్నారు. కనీసం కార్మికులకు విషయం చెప్పకుండా, లేఆఫ్ ప్రకటించడానికి గల కారణాలేంటని ప్రశ్నిస్తున్నారు. డిసిఎల్ వద్ద జరిగిన చర్చలు ఎటువంటి పురోగతి లేకుండా విఫలమయ్యాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, బొట్ట రాము, నమ్మి చినబాబు, బాలిబోయిన ఈశ్వరరావు, సలాది భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

**పరిశ్రమ వద్ద కొనసాగుతున్న వంటా వార్పు**

**ఆందోళన కొనసాగుతుందన్న నాయకులు**



డిసిఎల్ తో చర్చిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

జిందాల్ పరిశ్రమ వద్ద ఐదో రోజు కూడా కార్మికుల వంటావార్పు కొనసాగుతుంది. కార్మికులు ఆందోళన చెందనవసరం లేదని, పరిశ్రమను భేషరతుగా తెరిచే వరకు ఆందోళన కొనసాగుతుందని అన్నారు.

# లెక్కింపు కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం పార్లమెంట్ స్థానానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రం ఏర్పాటును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. ఆమె మంగళవారం లెండి ఇంజనీరింగ్ కళాశాల లోని కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎంపి స్థానం పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రం ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కేంద్రంలో లెక్కింపు త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా 20 టేబుళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏజెంట్లు, రిటర్నింగ్ అధికారి, ఇతర సిబ్బంది కూర్చోడానికి అవసరమైన ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన ఇవిఎం స్ట్రాంగ్ రూములను కలెక్టర్ పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఇతర అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. లెండి ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరచిన స్ట్రాంగ్ రూం వద్ద మూడంచెల భద్రతను ఎస్‌పి ఎం.దీపిక పర్యవేక్షించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాథ్, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

## మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం/పార్వతీపురం

మన్యం జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఒకవైపు, విద్యుత్ కోత మరోవైపు ఉండడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి కురుపాంలో కుండపోత వర్షం కురిసింది. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కనబడనంత విస్తారంగా వర్షం కురవడంతో ఆ కొద్దిసేపైనా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో రోడ్లన్నీ జలమయ మయ్యాయి. ఇటీవల ఇంత భారీ వర్షం కురిసిన దాఖలాల్లేవు. ఎండ వేడిమి నుంచి వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు, గర్భిణీలకు కొంత ఉపశమనం లభించిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

పార్వతీపురంలోనూ వర్షం కురిసింది. రహదారులు, పలు వీధులు జలమమయ మయ్యాయి. వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పనులకు సన్నద్ధమవుతున్నారు.

**ఎన్నికల విధుల్లో పాల్గొన్న**

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ అంగీకారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఎన్నికల పోలింగ్‌ను విజయవంతం చేసినప్పటికీ, విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందని, పారితోషికంగా విషయంలో అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లాఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మికి వివరించారు. ఈమేరకు మంగళవారం ఆమెను కలిసి వినతినిచ్చారు. పిఒ, ఎపిఒలకు రెండు రోజుల శిక్షణకే సర్టిఫికెట్ ఇస్తున్నారని, రెమ్యునరేషన్ కూడా రెండు రోజులే ఇచ్చారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ మూడు రోజులశిక్షణతో కలిపి డ్యూటీ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు అంగీకరించారు. రిజర్వులో ఉన్న ఉద్యోగులకు రెమ్యునరేషన్‌తో పాటు డ్యూటీ సర్టిఫికేట్ ఇవ్వడానికి అంగీకరించారు. అన్ని నియోజకవర్గాల రిసీవింగ్ సెంటర్‌లను విజయనగరంలో పెట్టడం వల్ల చాలా ఇబ్బందుల గురయ్యామని, ఇటువంటి పరిస్థితి పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరగా, ఈవిషయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపించే నివేదికలో పొందుపరుస్తామని కలెక్టర్ తెలిపారు. 14వ తేదీ రెమ్యూనరేషన్ చెల్లింపు విషయంలో(డ్యూటీ సెర్టిఫికెట్ అభ్యంతరం లేదు) పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయిక్, రాష్ట్ర నాయకులు డి.రాము, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్, ఆపస్ రాష్ట్ర కార్యదర్శి ఇ.రామునాయుడు, డిపిఆర్‌టియు నాయకులు కంది వెంకటరమణ, ఎపిటిఎఫ్ (257) అధ్యక్షులు షేక్ బుకారిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ (1938) నాయకులు సిహెచ్ పైడితల్లి, గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు పాడి.రమేష్ పాల్గొన్నారు.




కలెక్టరేట్‌కు వచ్చిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అశోక్‌తో భేటీ అయిన రఘురామకృష్ణంరాజు



# 125 స్థానాల్లో గెలుస్తాం

**టిడిపి నాయకులు రఘురామకృష్ణంరాజు**

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో 125 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి గెలుపొందుతుందని ఉండి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి రఘురామ కృష్ణంరాజు అన్నారు. ఈనెల 14న వైసిపికి మరణం సంభవించిందని, జూన్ 4న పెద్దకర్మ నిర్వహిస్తామని తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం నగరంలోని పైడితల్లి అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాకు చేరుకొని కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇక్కడ పైడితల్లి అమ్మవారిని గత రెండేళ్లగా దర్శించుకుందాం అనుకున్నప్పటికీ కుదరదని, నేడు దర్శనం కలిగిందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఓడిపోవడమే రాష్ట్రానికి పెద్ద పరిష్కారమన్నారు. బంగారం లాంటి రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరి చేశారన్నారు. వాటన్నింటికీ అతుకులు వేసుకుంటూ ఒక పక్కన అమరావతిని పునర్నిర్మించాలన్నారు. పోలవరం పనులను పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సమాన దృష్టితో జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో ఎన్నో కక్ష పూరిత చర్యలను జగన్మోహన్ రెడ్డి చేపట్టారన్నారు. ప్రధానంగా వేల ఎకరాలు భూమిని విద్యాసంస్థలకు ఇచ్చిన అశోక్ గజపతిరాజు జోలికి రావడం, ట్రస్ట్‌ను నాశనం చేయడానికి విజయ సాయిరెడ్డి ప్రయత్నం చేయడం చాలా దుర్మార్గమని అన్నారు. ఇంకా 13రోజులు మాత్రమే ఈ భస్మాసురుడి పాలన ఉంటుందన్నారు. సమావేశం లో విశాఖనార్త్ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నాయకులు రాజేష్‌బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదులలక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, పిల్లా విజయ్ కుమార్, అవనాపు విజయ్, గాడు అప్పారావు, కాళ్ల గౌరీశంకర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిరిమానోత్సవం

**దేవాలయాలకు, సిరిమానోత్సవానికి పోటెత్తిన జనం**

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి దాడితల్లి, పాతబొబ్బిలి సరేపొలమ్మతల్లి సిరిమానోత్సవాలు అంబరాన్ని తాకాయి. గొల్లపల్లి, పాతబొబ్బిలి గ్రామదేవత పండుగ సందర్భంగా మంగళవారం దాడితల్లి, సరే పొలమ్మతల్లి సిరిమానోత్సవాలు ఘనంగా జరిగాయి. సిరిమానోత్సవాలను తిలకించేందుకు వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేశారు. దాడితల్లి సిరిమానోత్సవం గొల్లపల్లిలో ప్రారంభం కాగా, ఓంకార్ టాకీస్, మేదరబంద, రెడ్డికవీధి, బజారు, తాండ్రపాపారాయ విగ్రహం, కోట జంక్షన్, వాటర్ ట్యాంక్, రైల్వే జంక్షన్, గాంధీబొమ్మ, కష్ణా టాకీస్, రావువారివీధి, గొల్లవీధి మీదుగా గొల్లపల్లి చేరుకుంది. సరేపొలమ్మతల్లి సిరిమానోత్సవం పాతబొబ్బిలి నుంచి ఆకులరెల్లి వీధి, సంఘవీధి, మేదరబంద, బజారు, తాండ్రపాపారాయ విగ్రహం, కోట జంక్షన్, వాటర్ ట్యాంక్ జంక్షన్, రైల్వే జంక్షన్, గాంధీబొమ్మ, ఎన్టీఆర్ బొమ్మ, రామాటాకీస్, జెండావీధి, దావాలవీధి మీదుగా పాతబొబ్బిలి చేరుకుంది. సరే పోలమ్మతల్లి సిరిమానోత్సవాన్ని పూజారి బొబ్బిలి అఖిల్, దాడితల్లి సిరిమానోత్సవాన్ని పూజారి బత్తిన శంకరరావు అధిరోహించారు.

**అమ్మవారు, సిరిమానోత్సవాన్ని దర్శించుకున్న ప్రముఖులు**

గొల్లపల్లి శ్రీదాడితల్లి, పాతబొబ్బిలి శ్రీసరేపొలమ్మతల్లిను ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి ఎంపి అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, టిడిపి అభ్యర్థి బేబినాయన, మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు దర్శించుకున్నారు. పంటలు బాగా పండాలని, ప్రజలను సుఖసంతోషాలతో చూడాలని ఆకాంక్షించారు.

**భక్తులతో ఆలయాలు కిటకిట**

గొల్లపల్లి దాడితల్లి, పాతబొబ్బిలి సరే పొలమ్మతల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొక్కులు తీర్చుకొనేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు.

**ఆకట్టుకున్న బల్ల వేషాలు**

గ్రామ దేవతల పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన బల్ల వేషాలు ఆకట్టుకున్నాయి. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, విష్ణు, శివుడు, అమ్మోరుతల్లి, వినాయకుడు వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అన్నదాతకు సిహ్నంగా ఎద్దుల వేషధారణ ఆకట్టుంది.

**దాహార్తిని తీర్చిన స్వచ్ఛంద సంస్థలు**


దాడితల్లి, సరే పొలమ్మతల్లి గ్రామదేవత పండుగలకు వచ్చే భక్తులు దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారులు చలి వేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, తాగునీరు సరఫరా చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో చలి వేంద్రాలు దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు ఎంతో దోహదం చేశాయి.



బొబ్బిలి వీధుల్లో ఊరేగుతున్న సిరిమాను



ఆకట్టుకున్న బల్లవేషాలు



దాడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపి బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి



ఆలయం వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ, బేబినాయన

## చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- బాడంగి

ఎండనక వాననక ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బులు దొంగల పాలు కాకుండా జరభద్రంగా దాచుకోవాలని ఎస్ఐ ఆర్ జయంతి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చాలా మంది సంపాదించిన నగలు, నగదు, అతి విలువైన వస్తువులు బీరువాలో భద్రపరిచి తాళం వేసి ఆ తాళం చెవులు మాత్రం టివి, బీరువా మీద నిర్లక్ష్యంగా పడవేసి ఉపాధి, పొలం పనులకు వెళ్లిపోతున్నారని, దీంతో తెలిసినవారే ఇంట్లోకి వచ్చి ఆ తాళం చెవితో బీరువా తెరిచి విలువైన సామాన్లు దొంగిలిస్తున్నారని అన్నారు. ఇంటి యజమాని తప్పనిసరిగా బీరువా ఇంటి తాళాలు జరభద్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటికి తాళాలు వేయకుండా ఆరు బయట ఆరుబయట నిద్ర పోకూడదని అనుమానించదగ్గ వ్యక్తులు గ్రామాల్లో తిరిగేటప్పుడు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

## దోపిడీ విధానంతో ప్రమాదం

ప్రజాశక్తి - వేపాడ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న దోపిడీ విధానంతో ప్రమాదమని న్యాయవాది గొంప వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఎట్టిపరిస్థితుల్లో వ్యవస్థ కోసమే పనిచేస్తున్నాయన్నారు. మతోన్మాద శక్తులను అధికారం నుంచి తరిమి కొట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ బిఆర్ అంబేద్కర్ భావజాలాన్ని అనుసరించాలని భారత రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన అంశాలను ఆదర్శాలను సాకారం చేసుకోవాలని సూచించారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన లోతేటి కృష్ణ కుమారులు డాక్టర్ లోతేటి శివకుమార్, డాక్టర్ విజయభాస్కర్లు మంగళవారం వారి స్వగ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తమ తల్లి లోతేటి లక్ష్మి జ్ఞాపకార్థం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తమ సొంత గ్రామానికి ఏదైనా చేద్దామనే నిశ్చయంతో ఈ కార్యక్రమం చేపట్టామని వైద్యంతో పాటు ఉచిత మందులు కూడా పంపిణీ చేశామని అన్నారు. ఇదే గ్రామానికి చెందినవారు వైద్య శిబిరం ఏర్పాటు చేయటంపై గ్రామ పెద్దలు యువత అభినందనలు తెలిపారు.



గాజులరేగ శాఖా గ్రంథాలయంలో ఆడుకుంటున్న విద్యార్థులు

## కథలంటే మాకిష్టం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కథలంటే తమకెంతో ఇష్టమని విద్యార్థులు తెలిపారు మంగళవారం జిల్లా కేంద్రంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మి ఆధ్వర్యంలో సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పిల్లలతో సరస్వతి దేవి గేయాలు ఆలపించారు. విద్యార్థులకు గణితంలో మెలకువలు, వాటిని సులభతరంగా ఎలా చేయాలో నేర్పించారు. అనంతరం విద్యార్థులతో కథలు చెప్పించారు. కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు సహాయ గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, రిటైర్డ్ టీచర్ సన్యాసిరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉత్సాహంగా చదువుల ఆటలు**

స్థానిక గాజులరేగ శాఖ గ్రంథాలయంలో ఉత్సాహంగా చదువుల ఆటలు నిర్వహించారు. మంగళవారం గ్రంథాలయ శిక్షణ శిబిరాల్లో భాగంగా లైబ్రేరియన్ లక్ష్మణరావు విద్యార్థులతో ముందుగా మ్యాథమెటిక్స్ సూత్రాలు చెప్పి వారితో చిన్న చిన్న లెక్కలు చేయించి అనంతరం వాటిలో ఆటల రూపంలో ఏ విధంగా లెక్కలు చేయవచ్చు పిల్లలతో చేయించారు. దీంతో పిల్లలు మరింత ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా అయ్యన్నపేట జంక్షన్‌లో గల మదర్‌థెరిసా సేవాసంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణశాంతి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మదర్‌థెరిసా సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్, రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి రవికె మంచా, రోటేరియన్స్ డాక్టర్ రాధిక రాణి, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## భువనేశ్వర్ - సోలాపూర్ రైలు 24 గంటలు ఆలస్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

భువనేశ్వర్ టు సోలాపూర్ 01452నెంబరు గల రైలు 24గంటలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈనెల 20న ఉదయం 9.50గంటలకు విజయనగరం రైల్వే స్టేషన్‌కు రావాల్సి ఉండగా మొదట ఎనిమిది గంటలు ఆలస్యంగా నడుస్తుందని ప్రయాణికులకు సమాచారం ఇచ్చారు. దీంతో ప్రయాణికులంతా 8గంటల అనంతరం స్టేషన్‌కు చేరుకున్నారు. సమయం దగ్గర పడడంతో విచారణ కేంద్రంలో రైలు గురించి ఆరా తీశారు. 24 గంటలు ఆలస్యంగా నడుస్తుందని సిబ్బంది చెప్పడంతో ఒకసారిగా కంగు తిన్నారు. దీంతో సుమార్ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు స్టేషన్‌లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరికి రైల్వే అధికారులు భోజనం, టిఫిన్ వంటి సౌకర్యాలు అందించకపోవడంతో అసౌకర్యానికి గురయ్యారు. ట్రైన్ ఉదయం 10 గంటలకు రావడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై స్టేషన్‌మాస్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైల్వేట్రాక్ పునరుద్ధరణలో భాగంగా ఈ సమస్య తలెత్తుతుందని అన్నారు. సికింద్రాబాద్ టు అగర్తల వెళ్లే రైలు కూడా 12 గంటలు ఆలస్యంగా నడుస్తుందన్నారు.

## కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇటీవల ఫెడెక్స్ కొరియర్ పేరుతో వచ్చే కాల్స్‌తో ప్రజలు సైబరు మోసాలకు గురవుతున్నారని, ఇటువంటి నకిలీ కాల్స్ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పి ఎం.దీపిక పిలుపునిచ్చారు. ఈ తరహా మోసాల్లో సైబరు మోసగాళ్ళు ప్రజల మొబైల్స్‌కు ఫోను చేసి తాము ఫెడెక్స్ లేదా బ్లూ డాట్ కొరియర్ నుండి మాట్లాడుతున్నామని, మన గురించిన చిరునామా, ఆధార్ నంబరు, ఫోను నంబరు వంటి కొంత సమాచారాన్ని ముందుగా మనకు తెలిపి, మనం బుక్ చేసిన కొరియర్ పార్శిల్‌లో నిషేధిత మాదక ద్రవ్యాలు, ఫేక్ పాస్‌పోర్టు బంగారం వంటివి ఉన్నాయని కేసు కూడా నమోదయ్యిందని, విచారణ నిమిత్తం తాము సూచించిన ప్రాంతానికి రావాల్సి ఉంటుందని సమాచారాన్ని అందిస్తారని తెలిపారు. మన ఫోనును కేసు దర్యాప్తు చేస్తున్న సిబిఐ లేదా టాస్క్ ఫోర్స్ లేదా పోలీసు అధికారులకు కలుపుతామని తెలిపి, వేరే వ్యక్తులకు ఫోను కనెక్ట్ చేస్తారన్నారు. తదుపరి సైబరు మోసగాళ్ళు తమను పోలీసు అధికారిగా లేదా సిబిఐ అధికారిగా తమ ప్రత్యేక దర్యాప్తు సంస్థకు చెందిన వ్యక్తిగా పరిచయం చేసుకొంటూ, తన గుర్తింపు కార్డుగా నకిలీ ఐడి కార్డును పంపి దర్యాప్తు నిమిత్తం తమ వద్దకు రావాల్సి ఉంటుందని భయపెడతారన్నారు. తాము రాలేని పరిస్థితుల్లో ఉన్నామని చెబితే, ఆన్‌లైన్‌లో కూడా దర్యాప్తును ఎదుర్కొనవచ్చునని, తమకు ఒక లింకు పంపుతున్నామని, వాటిపై క్లిక్ చేసి, దర్యాప్తుకు హాజరుకావాలని సూచిస్తున్నారు. సైబరు మోసగాళ్ళు పంపిన లింకును క్లిక్ చేస్తే, తమ బ్యాంకు సేవింగు ఖాతాల్లోని నగదు చోరీకి గురవుతుందన్నారు. ఈ తరహా సైబరు మోసగాళ్ళ కాల్స్ కు భయపడాల్సిన పని లేదని, ఇటువంటి కాల్స్‌కు ప్రజలెవ్వరూ స్పందించ వద్దని, ఆయా నంబర్లు నుండి వచ్చే కాల్స్‌ను బ్లాక్ చేసి, సమాచారాన్ని స్థానిక పోలీసు స్టేషన్‌కు అందించాలన్నారు. ఎవరైనా నగదును పోగొట్టుకొన్నట్లయితే 1930 కు లేదా నేషనల్ సైబరు క్రైంపోర్టల్ లో రిపోర్టు చేయాలని ప్రజలను కోరారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

- ప్రభుత్వ స్థలాల్లో ఇష్టానుసారంగా నిర్మాణాలు
- ఎన్నికల బిజీలో అధికారులు.. విఆర్ఒల కనుసన్నల్లోనే పనులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సందట్లో సడేమియా అన్న చందంగా తయారైంది మండలంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణదారుల పనితీరు. అధికారులు ఎన్నికల నిర్వహణ బిజీలో ఉండగా ప్రభుత్వ డిపట్టా భూములను, గెడ్డ పోరంబోకు స్థలాలను ఆక్రమార్కులు దొడ్డిదారిన కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనికి స్థానిక విఆర్ఒలు సహకరించారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమార్కులు పెట్రేగిపోతున్నారన్న వాదన వినిపిస్తోంది.

పట్టణంలోని పుణ్యగిరికి వెళ్లే రహదారిలో గల జగనన్న కాలనీకి ఎంట్రన్స్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో ఆక్రమార్కులు ఆక్రమించి సిమెంట్ పోల్స్ వేశారు. ఈ ఆక్రమణ గూర్చి ప్రజాశక్తి దినపత్రికలో కథనం వెలువడగా రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి సిమెంటు పోల్సును తొలగించి ఆ భూమిలో ఇది ప్రభుత్వ భూమి ఆక్రమణదారులు శిక్షార్హులు అని హెచ్చరిక బోర్డు పాతారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇప్పుడు మరోసారి ఆక్రమార్కులు పెట్రేగిపోయారు. అధికారులు ఎన్నికల హడావిడిలో ఉండగా ఆక్రమణదారులు ప్రభుత్వ భూమిలో రెడీమేడ్ ప్రహరీ గోడను, ఒక షెడ్డును నిర్మించేశారు. ఈ ప్రభుత్వ భూమి ఇప్పటికే పలువురి చేతులు మారినట్లుగా తెలుస్తోంది. విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేసినప్పటికీ ఎన్నికల ప్రక్రియ పూర్తవగానే చర్యలు తీసుకుంటామని నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వటం రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులతో కుమ్మక్కయ్యారనేదానికి బలం చేకూరుతోంది.

**ముందుగా పాక ఆ తరువాత పక్కాగా**

మండలంలోని కాపుసోంపురం వన్ వద్ద విశాఖ - అరకు రహదారికి ఆనుకుని ఉన్న కొండగెడ్డ తాలూకా గెడ్డ పోరంబోకు స్థలంలో ఒక వ్యక్తి ముందుగా పశువులకు పాకను నిర్మించుకుని ఆ తరువాత ఎన్నికల సమయంలో పక్కాగా నిర్మాణాన్ని చేపట్టారు. ఇది జాతీయ రహదారి 516 ఆనుకుని ఉన్న విలువైన భూమి. వేల ఎకరాల పంట పొలాల ఆయకట్టుకు జలాధారమైన ఈ కొండగెడ్డ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా ఇరిగేషన్ శాఖ తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పునాదుల నిర్మాణం నుంచే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తామని, పై అధికారులకు తెలియజేస్తామని విఆర్ఒ కాలయాపన చేస్తూ రావడం ప్రభుత్వ భూముల రక్షణ పై రెవెన్యూ అధికారులకు ఉన్న చిత్తశుద్ధి ఎంటో తేటతెల్లమవుతుంది.

**కాలువలా మారిన పుణ్యగిరి గెడ్డ**

పుణ్యగిరి నుంచి బర్మా కాలనీ, సాలిపేట, శ్రీనివాసకాలనీ గుండా ప్రవహించి రాజుల చెరువులో కలిసే పుణ్యగిరి గెడ్డ పోరంబోకు స్థలంలో కొంతమంది పునాదులను నిర్మించి గెడ్డను కాలువలా మార్చారు. భూముల విలువలు పెరగడంతో ఎక్కడికెక్కడ ఆక్రమణలు పెరిగిపోయాయి.



కాపుసోంపురం వద్ద కొండ గెడ్డలో కట్టిన అక్రమ నిర్మాణం



పుణ్యగిరి రహదారిలోని ప్రభుత్వ భూములో వేసిన రడీమేడ్ ప్రహరీ ఇదే..

**ఎస్‌కోట మరో బెంగుళూరులా మారే అవకాశం**

జల వనరులు అంతరిస్తే కొన్నేళ్ల తరువాత ఎస్‌కోట పట్టణం మరో బెంగళూరులా మారే అవకాశాలు ఉన్నాయి. మండలంలోనిఆక్రమణకు గురవుతున్న గెడ్డలు, వాగులు, వంకలు, చెరువులను గుర్తించి వీటిపై త్వరలో కలెక్టర్కు ఫిర్యాదు చేస్తాం.

**ఈశ్వర్ ప్రసాద్, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి**

**నోటీసులు జారీ చేశాం**


ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి వాటిని తొలగించాలని నోటీసులు జారీ చేశాం. ఈ నిర్మాణాలను తొలగించకుంటే మేమే జెసిబితో తొలగిస్తాం.


**కిరణ్‌కుమార్, తహశీల్దార్ శృంగవరపుకోట**

# ఎవరికి వారే ధీమా

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతి నగరం నియోజక వర్గంలో వైసిపి, టిడిపి అభ్యర్థులు గెలుపు అవకాశాలపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ ముగియడంతో పార్టీ నాయకులతో వైసిపి, టిడిపి అభ్యర్థులు సమావేశాలు నిర్వహించారు. గ్రామాల వారికి ఎన్ని ఓట్లు పోలయ్యాయి. తమ పార్టీకి ఎన్ని ఓట్లు పడతాయి? ఎన్ని ఓట్లు మెజార్టీ వస్తుంది? ఎంత నష్టం కలుగుతుందో అంచనాలు వేసుకున్నారు. ఈ లెక్కన వైసిపి అభ్యర్థి బొత్స అప్పల నర్సయ్య 8 నుంచి 9 వేల ఓట్ల మెజార్టీతో గట్టెక్కుతామని భావిస్తుండగా, టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ మాత్రం 20వేల ఓట్లు మెజార్టీతో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ పది రోజుల ముందు వరకూ ఇక్కడ వైసిపికే గెలుపు అవకాశాలు ఉన్నాయని, డబ్బు ప్రభావం బాగా చూపుతుందని విశ్లేషకులు భావించారు.కానీ అనూహ్యంగా టిడిపి అభ్యర్థి శ్రీనివాస్ పలు గ్రామాల ఓటర్లను తమ వైపు తిప్పుకోవడంలో సఫలీకృతులయ్యారు. ఓటర్లు ఎక్కువగా ఉన్న గజపతినగరం, పురిటిపెంట, బొండపల్లి, దేవుపల్లి, గంట్యాడ, మరుపల్లి, మానాపురం తదితర గ్రామాల్లో ప్రభావితం చూపగలిగారు. వైసిపికి ఎక్కువ ఓట్లు పోలవు తాయని భావించిన చోట ఓట్లను చీల్చగలిగారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. డబ్బుల పంపిణీలోనూ వైసిపికి కంటే తాము తక్కువేమీ కాదన్నట్లు చేశారు. ఈ నేపథ్యంలో గెలుపు గ్యారెంటీ అని చెబుతున్నారు. అంతేకాకుండా పలు గ్రామాల వైసిపి నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు టిడిపిలో చేరడంతో వారిలో గెలుపు ధీమా ఎక్కువగా కనిపిస్తోంది.





వైసిపికి సంబంధించి నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలో గత ఎన్నికల్లో మెజార్టీ ఎక్కువగా రాగా, ఈసారి టిడిపికే 2వేలు వరకు మెజార్టీ వస్తుందని భావిస్తున్నారు. గంట్యాడలో 4వేలు, బొండపల్లిలో 2వేలు, దత్తిరాజేరులో వెయ్యి ఓట్లు మొత్తంగా 9వేలు మెజార్టీతో గెలుపొందుతామని లెక్కలు వేసుకున్నారు. కానీ గజపతినగరంలో ఎమ్మెల్యే అప్పల నర్సయ్య పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆయన చేసిన కూ కబ్జాలు, జాతీయ రహదారి విస్తరణలో చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టడం, రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకపోవడం వంటి ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. ఇవన్నీ ఓట్ల రూపంలో ప్రభావం చూపే అవకాశం ఉంది. అలాగే దత్తిరాజేరు మండలంలో గత ఎన్నికల్లో సుమారు 9వేల ఓట్లు వరకు మెజార్టీ వచ్చింది. ఈసారి 70శాతం వరకు ఓట్లు టిడిపికే పడతాయని ఆమండలంలోని ఓటర్ల నాడీ చెబుతుంది. ఈ నేపథ్యంలో టిడిపికే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు.



నగదు అందజేస్తున్న అప్పన్న

## 10వేలు వితరణ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని దల్లి పేట పంచాయతీ రాళ్లపాలెం గ్రామానికి చెందిన యువనేత మరాడ అప్పన్న యువకుల కోసం క్రికెట్ కిట్టుకు రూ.10వేలు నగదను అందజేశారు. వేసవి సెలవులు కావడంతో గాలిపేట గ్రామానికి చెందిన విద్యార్థులు, యువకులు ఆడుకునేందుకు పదివేల రూపాయలు తన సొంత సొమ్మును మంగళవారం అందజేశారు. గాలి సూర్యానారాయణ, కొయ్య రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక తవ్వకాలు నివారించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక చంపావతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు నివారించాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల మైనింగ్ విజిలెన్స్ అధికారులు మొక్కు బడిగా రామతీర్థం జంక్షన్ చంపావతి నదిలో ఇసుక తవ్వకాలు తనిఖీ చేశారన్నారు. మొయిద బ్రిడ్జి నుంచి జ్యూట్ మిల్లుకు వెళ్ళే బ్రిడ్జి వరకు ఇబ్బడి ముబ్బడిగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని వాటిని అధికార్లు తనిఖీ చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. మొయిద బ్రిడ్జి నుంచి జ్యూట్ మిల్ బ్రిడ్జి ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, తాగు నీటి పథకాలు, బోర్లు ఉన్నాయని వాటి దగ్గరే అక్రమార్కులు ఇసుక తవ్వకాలు జరిపి వేలాది రూపాయలకు అమ్ముకుంటున్న అధికార్లకు కనిపించ లేదా అని ప్రశ్నించారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరపడం వల్ల బోర్లు అడుగంటి నీరు అందకుండా పోతుందని, విజయనగరం పట్టణం, నెల్లిమర్ల, జరజాపుపేట గ్రామాలకు నీరందించే పథకాలు కూడా భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి ఎద్దడి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చస్త్రశారు. అధికార్లు వెంటనే స్పందించి ఇసుక తవ్వకాలు నివారించకపోతే జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## ఆరోగ్యశ్రీకి అనారోగ్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో పేదలకు ఆరోగ్యం అందించే ఆరోగ్యశ్రీకి అనారోగ్యం దాపురించిందని కాంగ్రెస్ నాయకులు పువ్వల శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. కొన్ని నెలలుగా ఆరోగ్యశ్రీకి రూ.1300 కోట్లుకు పైగా బకాయిలు ఉండడంతో ఆసుపత్రుల యాజమాన్యాలు బకాయిలు చెల్లించే వరకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలను అందించలేమని స్పష్టం చేశాయన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. నెలకు రూ.300 కోట్లు నిధులు విడుదల చేయాల్సిన ఈ ప్రభుత్వం చెల్లించకుండా ఇతరత్రా పథకాలకు తొలి ప్రాధాన్యాన్ని ఇస్తూ పేద రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. పేదల పేరు చెప్పి లక్షల కోట్లు బుక్కిన ఈ ప్రభుత్వం, బిల్లులు చెల్లించకుండా మొండికేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించి పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు 230 కోట్లకు పైగా బకాయిలు చెల్లించి పేద రోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ కాలేజీలో చేరాలంటూ ప్రచారం

ప్రజాశక్తి - రామభద్రపురం

జిల్లాలోనే అతి పెద్ద పాఠశాలగా పేరొందిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం కళాశాల స్థాయి కల్పించింది. ఈ ఏడాది నుంచి ఇక్కడ ఇంటర్ తరగతులు నిర్వహించనున్నారు. దీంతో తమ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఇంటింటా ప్రచారం చేపడుతుంది. ఇటీవల పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం ప్రచారాలు ముమ్మరం చేశారు. ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు ఆదేశాల మేరకు చుట్టుపక్కల హైస్కూల్‌లో పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన వారి సమాచారాన్ని సేకరిస్తూ, విద్యార్థులను చేర్పించడం కోసం ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు, బోదనాతీరుపై వివరిస్తూ ప్రవేశాల కోసం కృషి చేస్తున్నారు. అడ్మిషన్ల కోసం షెడ్యూల్ సిద్ధం చేసుకొని ప్రతిరోజు సమీప గ్రామాలను సందర్శించి విద్యార్థులను చేర్పిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఎస్ చింతలవలస గ్రామానికి ఉపాధ్యాయ బృంద సభ్యులు రెడ్డి ప్రభాకర్ రావు, మురళీధర్ రావు, శశిభూషణరావులు వెళ్లి విద్యార్థులను నమోదు చేశారు. కళాశాల ఏర్పాట్ల గురించి, అందులో గ్రూపుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ హై స్కూల్ ప్లస్ పట్ల విద్యార్థులు ఆకర్షితులయ్యేలా వివరించారు. ఈ ఏడాది ఎంపిసి, సిఇసి రెండు గ్రూపుల్లోనే ప్రవేశాలు ఉంటాయని వారు చెబుతున్నారు.



విద్యార్థుల వివరాలను సేకరిస్తున్న ఉపాధ్యాయులు

# బాల కార్మికులు ఉండరాదు

ప్రజాశక్తి- డెంకాడ

బాల బాలికలు ఏ విధమైన పనిలో ఉండరాదని బడిలో ఉండాలని, బాల బాలికలచే పనులు చేయించారాదని పని చేయించిన తల్లిదండ్రులు పనిలో పెట్టుకున్న యజమానులు చట్ట ప్రకారం శిక్షించ బడతారని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కల్యాణి అన్నారు. మండలంలోని గొలగాం గ్రామంలో బాల కార్మికుల నిషేధంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరించి బడికి పంపించాలన్నారు. ఎంఇఒ రాధాకృష్ణ మాట్లాడుతూ సనాతనంగా వస్తున్న కుటుంబ పనులు పేరుచెప్పి కొందరు బాల బాలికలను వెట్టిచాకిరీ పనులు చేయిస్తున్నారని ఆ విదంగా చేయరాదన్నారు. బడి ఈడు పిల్లలకు సంక్షేమ గృహాల ద్వారా విద్య నందిస్తున్నామని గుర్తు చేశారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల కార్మికులను రెస్క్యూ టీం ద్వారా గుర్తించి బడిలో చేర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డెవలప్మెంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్తేరు రాణి, డెంకాడ ఎస్ఐ బివి. రమణ, సర్పంచ్ బూర్లి అప్పలనాయుడు, సచివాలయ సెక్రటరీ మోహన్‌రావు, సీనియర్ అడ్వకేట్ తాడిరాజు, కోర్టు, సచివాలయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సివిల్ జడ్జి విజయ కల్యాణి

# ఘనంగా అసిరితల్లి సిరిమానోత్సవం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని కెల్ల గ్రామంలో అసిరితల్లి గ్రామదేవత పండగ సిరిమానోత్సవం మంగళవారం సాయింత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పురోహితులు అసిరితల్లి అమ్మవారి గుడిదగ్గర ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలంతా తమ మొక్కులను తీర్చుకున్నారు. మండలంలో కెల్ల పెద్ద గ్రామం కావడంతో బందువులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో గ్రామం జనావాసంతో కిటకిటలాడింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండ కమిటీ తగిన జాగ్రత్తలు తీసుకోగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు, నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, మెరకముడిదాం మండల నాయకులు తాడ్డి వేణు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎన్‌వి రమణరాజు (పెద బాబు), జెడ్‌పిటిసి కోట్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కు తీర్చుకుంటున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

# నవ ధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి- గరివిడి

నవధాన్యాలు సాగు నేలతల్లి బాగు అనే నినాదంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఖరీఫ్ సీజన్‌లో తొలకరి వర్షాలు ముందు పాటించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ సూర్యకుమారి రైతులకి తెలిపారు. మండలంలోని గెడ్డపువలస గ్రామమంలో మంగళవారం ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఎకరానికి 12 కేజీలు విత్తనాలు చల్లుకోవడం ద్వారా నేల సారవంతంగా ఉంటుందన్నారు. నేల ఎల్లపుడూ తేమగా ఉంటుందని, నేలలో ఉండే సూక్ష్మజీవులు సంవృద్ధిగా అభివృద్ధి చెంది మొక్కలకు అందిస్తాయని చెప్పారు. నేలకోతకి గురి కాకుండా ఉంటుందని, పశువుల మేతకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సంవత్సరం ప్రతి రైతు తనకున్న విస్తీర్ణంలో నవధాన్యాలు సాగు చేయించాలని కోరారు. ఈ నవధాన్య కిట్లు రైతు భరోసా కేంద్ర పరిధిలో రైతులకు అందు బాటులో ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇంచార్జి సింహాచలం, రాము, తుమ్మగంటి సుశీల, చీడి రామకృష్ణ, సిగ అనసూయ, మీసాల గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.



నవధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది సూర్యకుమారి



ఆదినారాయణకు చెక్కును అందిస్తున్న ఎస్‌ఎస్‌రావు, విసి ప్రశాంత్‌కుమార్ మహంతి

## సెంచూరియన్ విద్యార్థికి పారితోషికం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం బిబిఎ విద్యార్థి భట్టు ఆదినారాయణకు ఎస్టేట్ ఆఫీసర్ ఎస్.ఎస్.రావు రూ.5వేలు పారితోషికం అందజేశారు. మంగళవారం సాయంత్రం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి తన ఛాంబర్‌లో మాట్లాడుతూ క్రీడాకారులను ప్రొత్సహించడం అభినందించదగ్గ విషయమన్నారు. కాగా, ఇటీవల అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్‌లో జరిగిన ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆదినారాయణ 81 కిలోల విభాగంలో రజత పతకం సాధించిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఎస్.ఎస్.రావు మాట్లాడుతూ తాను ఆదినారాయణకు ప్రతి నెల రూ.5వేలు పారితోషికం అందజేస్తానని ప్రకటించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ, కోచ్ అర్జున్ పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ తవ్వకాలపై క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే క్రిమినల్ కేసులు పెడతామని ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, ఎస్ఇబి ఎస్ఐ తిరుమలరావు హెచ్చరించారు. మండలంలోని అలజంగి వేగావతి నది పరివాహక ప్రాంతాలను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులూ లేవన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు నివారణకు సహకరించాలని, అక్రమ తవ్వకాలు జరిపితే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.



నదీ పరివాహాక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ